క్లుప్తంగా

క్రీడాకారులకు అభినందన



అభినందిస్తున్న రాజిరెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని ప్రాంతంలోని పాఠశాలల స్థాయిలో 23న నిర్వహించిన ఖోఖో పోటీల్లో అండర్–14 విభాగంలో యైటింక్లయిన్‌కాలనీ స్పందన మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కాగా ఆదివారం కాలనీ అబ్దుల్‌కలాం స్టేడియంలో కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి వారిని అభినందించారు. డాక్టర్ రవీందర్, నాయకులు శనిగరం తిరుపతి, పాఠశాల కరస్పాండెంట్ ఓదెలుయాదవ్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న కాలనీవాసులు

జ్యోతినగర్: ఆటోడ్రైవర్ కుటుంబానికి ఆసరాగా మేమున్నామంటూ కాలనీవాసులు ఆర్థిక సాయం అందించి భరోసా కల్పించారు. ఎన్టీపీసీ రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీ (కళావతి నగర్)కు చెందిన ఆటోడ్రైవర్ మారెపల్లి సాంబయ్య అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. దీంతో కాలనీవాసులు రూ.15వేలు జమ చేసి సాంబయ్య కుటుంబసభ్యులకు ఆదివారం అందించారు. మారముల్ల మల్లన్న, ఐలయ్య, కుమార్, కొమురయ్య, మొండయ్య, జలీల్‌పాషా, మున్వర్ పాల్గొన్నారు.

సేవాట్రస్ట్ ఆత్మీయ సమ్మేళనం



సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని నర్సయ్యపల్లిలోని విజయ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బాల్యమిత్రుల సేవాట్రస్ట్ 1979–81 జీజేసీ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాట్రస్ట్ ద్వారా అనేక సమాజ సేవలు అందించడంతో పాటు రానున్న రోజుల్లో మరింత సేవ చేయాలని సమ్మేళనంలో చర్చించుకున్నారు. ట్రస్ట్ ప్రతినిధులు, సభ్యులు తిరుపతి, లక్ష్మారెడ్డి, రామ్మూర్తి, సుధాకర్, ప్రేమ్‌చందర్, దన్నయక్ దామోదర్‌రావు, రామస్వామి, చంద్రశేఖర్, బాలకిషన్, విజయ్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని రాయదండిలో ఆదివారం సీసీరోడ్డు నిర్మాణ పనులకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఠాకూర్ ఇటీవల శంకుస్థాపన చేశారు. సదరు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి బొడ్రాయి వరకు రూ.10లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకులు ఎండీ.గౌస్‌బాబా, మహ్మద్ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు.

నేటి నుంచి ఈజీఎస్ గ్రామసభలు

సుల్తానాబాద్: మండలంలోని వివిధ గ్రామాల్లో 25 నుంచి 31 వరకు సామాజిక తనిఖీ గ్రామసభలు (ఈజీఎస్ సోషల్ ఆడిట్) నిర్వహించనున్నట్లు ఎంపీడీవో దివ్యదర్శన్ రావు తెలిపారు. 25న నారాయణపూర్, గర్రెపల్లి, రేగడి మద్దికుంట, ఐతరాజుపల్లి, కొదురుపాక, కదంబాపూర్, కాట్నపల్లి, 27న గొల్లపల్లి, నారాయణరావుపల్లి, రామునిపల్లి, 28న నీరుకుల్ల, సుద్దాల, గట్టెపల్లి, భూపతిపూర్, కనుకుల, చిన్నకల్వల, మంచిరామి, 31న సాంబయ్యపల్లి, కందునూరిపల్లి, చిన్నబొంకూర్, అల్లిపూర్, తొగర్రాయి, మియాపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీన ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు మండల సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఆదివారం డార్విన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు జనరల్ ఫిజీషియన్ పలు రకాల పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్‌రావు, మాజీ సర్పంచ్ అర్సనపల్లి వెంకటేశ్వరరావు, ఆర్యవైశ్య మండల ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సతీశ్‌బాబు, భరోసా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మల్యాల వేణుగోపాల్, తాటిపల్లి సాయితేజ, శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

విస్తరణకు నోచుకునేనా?

- గుంతల రోడ్లతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- డబుల్‌రోడ్డు నిర్మించాలని డిమాండ్



గుంతలమయంగా పేంచికల్‌పేట నుంచి గోదావరిఖనికి వెళ్లే రహదారి

కమాన్‌పూర్: మండల కేంద్రం నుంచి పేంచికల్‌పేట మీదుగా గోదావరఖని, ఎన్టీపీసీకి వెళ్లే ప్రధాన రహదారి డబుల్‌రోడ్డుగా ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని మండల ప్రజలు, వాహనదారులు ఎదురుచూస్తున్నారు. మండల కేంద్రంలోని శ్రీపాద విగ్రహం నుంచి పేంచికల్‌పేట సమీపంలోని సింగరేణి కోల్‌కారిడార్ రోడ్డు వరకు ప్రస్తుతం ఆరు కిలోమీటర్ల సింగిల్ తారురోడ్డు ఉంది. దీంతో గోదావరిఖని నుంచి వచ్చే ఆర్టీసీ ఇరత వాహనాలు కోల్ కారిడార్ రహదారి నుంచి వయా యైటింక్లయిన్‌కాలనీ, ఓసీపీ–1, జూలపల్లి మీదుగా కమాన్‌పూర్ రావాలంటే సుమారు 11 కిలోమీటర్ల దూరం అదనంగా ప్రయాణించాలి. అదే కోల్‌కారిడార్ నుంచి పేంచికల్‌పేట మీదుగా వస్తే 6 కిలోమీటర్ల దూరం వస్తుంది. కాలనీ నుంచి అదనంగా 5 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు.

నిత్యం వాహనాల రద్దీ..

కమాన్‌పూర్ నుంచి పేంచికల్‌పేట మీదుగా గోదావరిఖనికి వెళ్లే రహదారిలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. పెద్దపల్లి నుంచి గోదావరిఖని, ఎన్టీపీసీ, ఎఫ్‌సీఐకి వెళ్లే లారీలు, ఇతర వాహనాలకు రాజీవ్ రహదారి బసంత్‌నగర్ వద్ద ఉన్న టోల్‌గేట్ రుసుం చెల్లించాల్సి ఉండడంతో లారీలు, ఇతర వాహనదారులు కమాన్‌పూర్ మీదుగా 'ఖని'కి వెళ్తున్నారు.

నిధులు మంజూరు..

మండల కేంద్రంలోని శ్రీపాద విగ్రహం నుంచి పేంచికల్‌పేట గ్రామ చౌరస్తా వరకు ఉన్న రహదారి మరమ్మతు కోసం ఇటీవల రూ.40 లక్షల నిధులను మంత్రి శ్రీధర్‌బాబు మంజూరు చేయించారు. పేంచికల్‌పేట గ్రామ చౌరస్తా నుంచి సింగరేణి కోల్‌కారిడార్ వరకు ఉన్న రహదారి, ఓసీపీ–3 సీఎస్‌పీ నుంచి ఎన్టీపీసీకి బొగ్గు రవాణా చేసే రైల్వే ట్రాక్ నుంచి ఎఫ్‌సీఐ వరకు ఉన్న రహదారి అడుగుకో గుంత ఏర్పడింది. దీంతో రెండు రహదారులు గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్డు పూర్తిగా గుంతలమయం



కమాన్‌పూర్ నుంచి గోదావరిఖనికి, ఎన్టీపీసీకి పేంచికల్‌పేట మీదుగా పోవాలంటే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా ఉంది. ఆటోలు మాటిమాటికీ మరమ్మతుకు గురవుతున్నాయి. కిరాయికి వెళ్లాలంటే జూలపల్లి, యైటింక్లయిన్‌కాలనీ మీదుగా పోవాల్సి వస్తోంది. ఆటో కిరాయిలు లేక అల్లాడుతున్నాం. పలుమార్లు రహదారి బాగు చేయాలని విన్నవించినా ఎవరూ పట్టించుకుంటలేరు. – నర్సయ్య, ఆటోడ్రైవర్, కమాన్‌పూర్

నిధులు మంజూరు చేయాలి



కమాన్‌పూర్ మండల కేంద్రం నుంచి గోదావరిఖనికి వెళ్లే ప్రధాన రహదారిని సింగరేణి కోల్ కారిడార్ రహదారి వరకు డబుల్‌రోడ్డు విస్తరించడానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు మంజూరు చేయాలి. గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధి కోసం రూ.కోట్ల నిధులు వెచ్చిస్తున్న ప్రభుత్వం నిత్యం రద్దీగా ఉండే రహదారికి నిధులు మంజూరు చేసి డబుల్‌రోడ్డుగా విస్తరిస్తే వాహనదారులకు దూరభారం తగ్గుతుంది. – మచ్చగిరి రాము, కమాన్‌పూర్

గోమయ గణపతులనే పూజిద్దాం

- రేడియేషన్‌ను దూరం చేస్తుంది
- దేశీయ ఆవుపేడతో తయారు చేసే ప్రతిమలతో బహుళ ప్రయోజనాలు



గోమయ గణపతితో పిల్లలు



గోమయ గణపతి ప్రతిమలతో చిన్నారులు

పెద్దపల్లిరూరల్: గోమయ గణపతులను పూజిస్తే పర్యావరణ పరిరక్షణే కాదు.. ప్రస్తుతం మన చుట్టూ పరిసరాల్లో ఉన్న రేడియేషన్ నుంచి రక్షణ పొందొచ్చు. దేశీయ ఆవు పేడతో బొజ్జ గణపయ్యలను సుందరంగా తీర్చిదిద్ది తయారు చేస్తూ కలుషిత వాతావరణాన్ని కట్టడి చేసే ప్రయత్నం చేస్తున్నారు పట్టణంలోని భూంనగర్‌కు చెందిన కర్రె అర్చన. రెండేళ్లుగా దేశీయ ఆవుపేడతో పాటు సింధూరం విత్తనాలు, సహజంగా లభించే జిగుర్లు, నీళ్లలో కరిగిపోయే రంగుల మిశ్రమాలతో అందమైన గోమయ గణపతులను తయారు చేస్తూ వినాయక చవితి పర్వదినానికి సిద్ధం చేస్తున్నారు. గోమయ గణపతులను పూజిద్దాం పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుదాం అని ఆమె పిలుపునిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో అందంగా కనిపించే వినాయక విగ్రహాలతో వాతావరణం కలుషితమయ్యే ప్రమాదముందని, మట్టి గణపతుల వైపు కొందరు దృష్టిసారించారు. పర్యావరణాన్ని కాపాడుతూనే ఎలక్ట్రానిక్ వస్తువుల నుంచి విడుదలయ్యే రేడియేషన్‌ను కూడా గోవు పేడతో తయారయ్యే గణపతులు దూరం చేస్తాయని అర్చన పేర్కొంటున్నారు.



గోమయ గణపతి ప్రతిమ

గో ప్రాముఖ్యతపై అవగాహన

పల్లె ప్రాంతాల్లో గోవులను పూజించే సంస్కృతి ఎప్పటి నుంచో ఉంది. గోవుల పేడతో గతంలో ఇంటి ముందు కల్లాపి చల్లడంతో ఇతర అవసరాలకు వినియోగించేవారు. దేశీయ ఆవుపేడతో పూజలకు ఉపయోగపడే వస్తువులను సుగంగ భరితంగా ఉండేలా తయారు చేస్తూ గోప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నారు అర్చన.

ప్రతిమలు సిద్ధంగా ఉన్నాయి



దేశీయ ఆవుపేడతో తయారు చేసిన రంగు రంగుల గోమయ గణపతులు సిద్ధంగా ఉన్నాయి. గణపతులను నవ రాత్రులు పూజించాక ఇంటి ఆవరణలోనే నిమజ్జనం చేస్తే అది ఎరువుగా, అందులోని విత్తనాలు మొక్కలుగా మొలకెత్తి ఉపయోగపడతాయి. గణపతి విగ్రహాలే కాకుండా అగర్‌బత్తిలు, ప్రమిదలు ఇలా రకరకాల ఉత్పత్తులు తయారు చేస్తున్న. – కర్రె అర్చన, భూంనగర్, పెద్దపల్లి

రాష్ట్రపతి భవన్ సందర్శించిన అంతర్గాం విద్యార్థులు



సందర్శనలో అంతర్గాం హైస్కూల్ విద్యార్థులు

రామగుండం: హైదరాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి భవన్‌ను ఆదివారం అంతర్గాం హైస్కూల్ విద్యార్థుల బృందం సందర్శించారు. దీంతో పాటుగా బిర్లా సైన్స్ మ్యూజియం, బిర్లామందిర్, భారీ అంబేడ్కర్ విగ్రహం, సచివాలయం సందర్శించారు. పర్యటనలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, తుల శోభారాణి, భాస్కర్‌రెడ్డి, అరుణ, రాజ్యలక్ష్మి, ఫహిమ, జ్యోతి, కొమురయ్య ఉన్నారు.

నేత్రదానంపై అపోహలు వీడాలి



ప్రశంసా పత్రం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పాలకుర్తి: నేత్రదానం ద్వారా మరో ఇద్దరికి కంటి చూపు ప్రసాదించవచ్చని సదాశయ ఫౌండేషన్ పాలకుర్తి మండల అధ్యక్షుడు భీమనపల్లి పృథ్వీరాజ్ అన్నారు. ఇటీవల కన్నాలకు చెందిన భూతగడ్డల పోషమల్లు మరణించగా అతని నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేశారు. ఆదివారం కన్నాలలో భూతగడ్డల పోషమల్లు సంస్మరణ సభ నిర్వహించిన ఫౌండేషన్‌సభ్యులు కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రం అందజేశారు. ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి భీష్మాచారి, జిల్లా సలహాదారులు దేవీ లక్ష్మీనర్సయ్య, సభ్యులు బొడ్డుపల్లి లక్ష్మణ్, మీన మహేందర్, చింతకింది కనుకయ్య, రణవేని లక్ష్మణ్, భూతగడ్డల కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూస్తాం



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమేశ్

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో తాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్యలు రాకుండా పైపులైన్ పనులకు మరమ్మతు చేయించినట్లు మున్సిపల్ కమిషనర్ రమేశ్ తెలిపారు. ఐదో వార్డులో ఆదివారం పైప్‌లైన్ లీకేజీ కావడంతో మున్సిపల్ కార్మికులతో మరమ్మతు చేసి కొత్త పైపులు బిగించారు.

ప్రజాసంఘాల నేతల ముందస్తు అరెస్టు



పోలీసుల అదుపులో నేతలు

పెద్దపల్లిరూరల్: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలంటూ వరంగల్‌లో ఆదివారం తలపెట్టిన సభకు వెళ్లకుండా ప్రజాసంఘాల నాయకులను పెద్దపల్లి రూరల్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా విప్లవ రచయితల సంఘం జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య, పులిపాక రవీందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేంద్రం ఆపరేషన్ కగార్ పేరిట సాగిస్తున్న దమనకాండను వెంటనే నిలిపి వేయాలని వారు డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆటపాటలతో కాలక్షేపం చేశారు.



ముత్తారం: అడుగడుగునా గుంతల రోడ్డుతో ప్రయాణమే ప్రాణసంకటంగా మారిందని వాహనాదారులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఓడెడ్ నుంచి గంగాపురి వరకు సుమారు 18 కిలోమీటర్ల దూరం ఈ గుంతల రోడ్డుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయినా కనీస మరమ్మతు చేసేవాళ్లు లేరని స్థానికులు వాపోతున్నారు. త్వరగా రోడ్డుకు మరమ్మతు చేయాలని వాళ్లు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ



నివాళి అర్పిస్తున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: మాజీ ఎంపీ, ఏఐటీయూసీ యూనియన్ ప్రధాన కార్యదర్శి సింగరేణి కార్మికుడు కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సుధాకర్‌రెడ్డి యూనియన్‌కు, కార్మికులకు చేసిన సేవలను కొనియాడారు. సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్.ప్రకాశ్, కందుకూరి రాజారత్నం, ఆర్జీ–2 ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి జీగురు రవీందర్, సాంబశివరావు, బుర్ర తిరుపతి, సత్యనారాయణ, శంకర్, మహేందర్, కుమారస్వామి, ఆంజనేయులు, పోశం, శ్రీనివాస్, రాజేందర్, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 3కె రన్



రన్‌లో పాల్గొన్న స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి తిరుపతి

సుల్తానాబాద్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సుల్తానాబాద్‌లోని ఖేలో ఇండియా ఖోఖో సెంటర్‌లో నిర్వహించిన 3కె రన్ ఉత్సాహంగా సాగింది. సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి తిరుపతి జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఒలంపిక్ హాకీ స్వర్ణ పతక విజేత, ప్రపంచ హాకీ చరిత్రలో ఒక లెజెండ్‌గా నిలిచిన ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలన్నారు. కోచ్ గెల్లు మధుకర్, ఫిజికల్ డైరెక్టర్లు తాండ్ర ప్రణయ్, వెంకటేశ్, అజయ్, నయీమ్, రాకేశ్, రాజు పాల్గొన్నారు.

మొరాయించిన రైల్వేగేటు వాహనదారుల తిప్పలు



గేటు వద్ద నిలిచిన వాహనాలు

పాలకుర్తి: మండలంలోని కన్నాల రైల్వేగేటు వద్ద ఆదివారం వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి వాహనదారులు ఇబ్బంది పడ్డారు. గేటుకు సంబంధించిన వైర్ తెగిపోవడంతో గేట్ ఓపెన్ కాలేదు. దీంతో బోడగుట్టపల్లి మీదుగా కన్నాల, లంబాడితండా, రాణాపూర్ గ్రామాల మీదుగా గోదావరిఖని వైపు వెళ్లే వాహనదారులతో పాటు బసంత్‌నగర్ వైపు వచ్చే వాహనాలు నిలిచిపోయాయి. రైల్వేగేటుకు మరమ్మతు నిర్వహించడంతో దాదాపు రెండుగంటల అనంతరం గేటు తెరుచుకోవడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.

పోటాపోటీగా గౌడసంఘం ఎన్నికలు



అధ్యక్షుడిగా ఎన్నికైన చిన్నరాములుగౌడ్

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో గీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికలు పోటీపోటీగా జరిగాయి. ఆదివారం నిర్వహించిన సంఘం ఎన్నికల్లో ముగ్గురు పోటీపడ్డారు. కాగా బ్యాలెట్‌తో జరిగిన ఎన్నికలు పోటాపోటీగా జరిగాయి. పల్లె చిన్న రాములుగౌడ్ మూడు ఓట్ల తేడాతో విజయం సాధించారు. సంఘం సభ్యులు పూరెల్ల గంగయ్యకు 27 ఓట్లు రాగా, తీగెల అశోక్ గౌడ్‌కు 46 ఓట్లు, పల్లె చిన్న రాములుగౌడ్‌కు 49 ఓట్లు పోలయ్యాయి. పల్లె చిన్నరాములుగౌడ్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు పోలింగ్ అధికారులు పనగట్ల శ్రీనివాస్, కనుకయ్య ప్రకటించారు. అధ్యక్షుడికి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ శుభాకాంక్షలు తెలిపారు. ఎన్నికల్లో సంఘం సీనియర్ నాయకులు, గుడూరి శ్రీనివాస్, నర్సయ్యగౌడ్, వెంకటేశ్ గౌడ్, బుర్ర మహేశ్, ఉయ్యాల పర్శరాములుగౌడ్, పల్లె సురేశ్ ఉన్నారు.

ఖనికి సీఎస్ఐ పీఠాధిపతి కె.రూబెన్‌మార్క్

గోదావరిఖనిటౌన్: చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) మోడరేటర్ కరీంనగర్ అధ్యక్ష మండల పీఠాధిపతి, మోస్ట్ రెవరెండ్ డాక్టర్ ప్రొఫెసర్ కె.రూబెన్‌మార్క్ ఆదివారం గోదావరిఖనికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీనగర్‌లోని సీఎస్ఐ సెయింట్ పాల్స్ చర్చ్ సంఘం స్వాగతం పలికారు.

ఆర్థికసాయం అందజేత

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండా పంచాయతీ పరిధిలో గల రాజీవ్‌తండాకు చెందిన బదావత్ రాజేందర్ ఇటీవల కాలుజారి పడటంతో నడుము భాగంలో ఎముక విరిగింది. కరీంనగర్‌లోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ బదావత్ రాజునాయక్ బాధితుడిని పరామర్శించి రూ.10వేలు అందజేశారు.

నియామకం

ధర్మారం: ధర్మారం వ్యాపార వర్తక సంఘం మండల అధ్యక్షుడిగా కుంట రాజును ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ధర్మారంలో ఆదివారం సమావేశమైన వర్తక వ్యాపార సంఘం సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా తలమక్కి రవీందర్‌శెట్టి, కేతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జైన చంద్రమౌళి, అధ్యక్షుడిగా కుంట రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎలగందుల అశోక్, కోశాధికారిగా మూటపల్లి తిరుపతి, ఉపాధ్యక్షులుగా ఉమా శంకర్, వెన్నెల ఎల్లారెడ్డి, ఎండీ జహీర్, బూస లక్ష్మణ్ సహాయ కార్యదర్శిగా ఎండీ ముజాహిద్, ప్రచార కార్యదర్శిగా విట్ల రవి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.